
# పయటచెంగు



సర్పరాజు నోట జిక్కిన మండూకంలా ఆనందమూర్తి కాల సర్పం నోట బడి గిలగిలలాడుతున్నాడు.

పశ్చిమ దిశాసంద్రమున దినకరుడు క్రమంగా అస్తమిస్తున్నాడు.

ఆనందమూర్తికి మృత్యువాత బడుతున్న భీతి ఏమాత్రమూ లేదు. కాని, తీరని కోరిక ఏదో ఇక తీరదన్న బెంగ మాత్రం తీవ్రమై వేధిస్తోంది. అసువు లున్నంతవరకు ఆ కోరిక తీర్చు కోవాలన్న ఆకాంక్ష మాత్రం ఉంది.

అది పాలకుర్తి క్షుద్రగామ ప్రాంతం. వేపచెట్టు క్రింద ఆనందమూర్తి మేను వాల్చి ఉన్నాడు. దిండులా ఉన్న చేపంచిని తలగడలా వేసుకున్నాడు. చూపులు చెరువు కట్ట రహదారి మీద నిలిచి ఉన్నాయి.

ఆనందమూర్తికి ఇరువురు కుమారులు. ఇరువురి పెళ్ళిళ్ళూ అయ్యాయి. పెద్దవానికి మాత్రం ఓ కూతురు కలిగింది. ఇందరున్నా, తనతో ఏ ఒక్కరూ లేరనే చింతైనా లేదు. దిక్కు మొక్కు లేని చావు చావ నున్నందుకు దిగులుపడ్డంలేదు. తన ఇంటా పేటా ఏదిగాక ఎక్కడో తన వారే కాదు, తన నెరుగువారైనా లేని ఊర కాదు, ఊరవతల అసువులు బాసే దురదృష్టానికి గుండె గింజంతైనా వగచ టం లేదు. కాని, తీరని కోరిక వల్ల తీక్షణంగా బాధ పడుతున్నాడు. అది తీరే నమ్మకం లేదు. తీరుతుందన్న నమ్మకం అంతకన్నా లేదు; తీరాలన్న ఆకాంక్ష నిక్షేపంలా ఉంది.

ఆనందమూర్తి చూపులు సీరసంగా, అతి ప్రయత్నం మీద చుట్టూ కలయ జూస్తున్నాయి. మధ్య మధ్య మూతలు పడుతున్నాయి.

అస్తమించు సూర్యుని చూడలేక పడమటి ఆకాశం దుఃఖాతిశయం చేత జేవురించింది. మందంగా వీస్తున్న గాలి ఆవేగాన్ని పుంజుకుంటూంది.

పయటచెంగు ఎవరిదో రెపరెప లాడుతూంది.

చెరువు నీటి సమీపంలో నిలువెత్తు బండరాయి ఉంది. దాని దాపు నుండి పయటచెంగు రెపరెపలాడుతూంది. గాలి ఆవేగానికి తట్టుకో లేకపోతూంది. ఆపయట చెంగు దర్శనం ఆనందమూర్తికి అదృష్టదేవత ప్రసన్నమైనట్లు తోచింది. ఆనందోత్సాహాలు కట్ట తెగిన ప్రవాహమే అయ్యాయి. తన చిరకాల వాంఛ ఏదో విధంగా తీరుతుందనే ఆశాజ్యోతి దివ్యంగా వెలిగింది.

**బి. ఆగరాజు**

ఆనందమూర్తి జీవితానికీ, పయట చెంగుకూ అవినాభావ సంబంధ మేమిటో!

* * *

పట్టపగలు సంధ్యాసమయంలా ఉంది. వినువీథిని నీలమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. వర్షాగమనం ఇప్పుడో, అప్పుడో అన్నట్లుంది.

విశ్వవిద్యాలయం రహదారి. ఆయా కార్యార్థులు వర్షాగమన ఛాయలకు వెరచి వడివడిగా అడుగిడుతున్నారు.

ఆనందమూర్తి బి. ఎ. ప్రొవిజినల్ సర్టిఫికేట్ తీసుకొని గృహోన్ముఖు డయ్యాడు. ఎదురుగా ఓ అమ్మాయి అందచందాలనే వరంగా పొంది భువి మీది కవతరించిన దివ్యసుందరిలా విసవిస వస్తోంది.

ఇరువురూ అవనతముఖులై అభి ముఖంగా నడుస్తున్నారు.

గాలి అంతలోనే ముమ్మరంగా వీవ సాగింది. ఆకాశంలో మేఘాలు ప్రభంజ నుని విజృంభణకు ప్రతిగా కాలికి బుద్ధి చెప్పసాగాయి. తరులతాగుల్మాలు ఒళ్ళు విరుచుకుంటున్నాయి. దుమ్ము, ధూళి మిన్నెత్తున లేచి పిచ్చెత్తినట్లు గాలికి తోడయ్యాయి.

ఆనందమూర్తి, ఆ దివ్యసుందరి కాసేపట్లోనే పక్క పక్కన అయ్యారు. ఇరువురి భుజాల ఘర్షణ వెంట్రుకవాసిలో తప్పింది. ఆ క్షణంలోనే గాలి ఆనంద మూర్తి కభిముఖంగా రయ్యమని మళ్ళింది. ఆమె పయటచెంగు 'రప్' మని ఎగిసి అతని ముఖమండలాన్ని నిండుగా ఆచ్ఛాదిం చింది.

ఆనందమూర్తి ఒక్క అడుగైనా ముందుకు వేయలేదు. ఆ అందాల రాశి వేసిన అడుగు తీయలేదు. పరస్పరాభిముఖు లయ్యారు. ఒండొరుల చూపుల్లోనే ఆశ్చర్యార్థకం ప్రస్ఫుటమైంది. క్షణాలు కొన్ని గతంతో చేతులు కలిపి తమ ముచ్చట తీర్చుకున్నాయి.

ఆశ్చర్యం నుండి తేరుకున్న వారి అధరాలపై దరహాసం చిందులు తొక్కింది. అనంతరం తలలు నేల వాలాయి. ఆకస్మిక సంఘటనను నెమరు వేసుకుంటూ ఎవరిదారిని వారు పోయారు.

ఆ సంఘటన ఆనందమూర్తిలో తనకు తెలిసీ తెలియకుండా రూపు దిద్దుకుంటున్న అభిప్రాయాన్ని ఇనుమ డింపచేసి చెరగని ముద్ర వేసింది. ఆ అమ్మాయి ముఖబింబ మాతని హృదయాకాశంలో పూర్ణచంద్రబింబంలా ప్రతిబింబించింది.

ఆనందమూర్తి ముఖారవిందాన్ని పయట చెంగు దైవికంగా అతని వాత్సల్యాన్ని తలపింపచేసింది.

ఆ నాటి ఉదయం—ఆనందమూర్తి స్నానం చేసి మొలకు ధోవతి చుట్టుకొని తన గదిలోకి వెళ్ళాడు. అటుపక్కనుంచి ఉడుపులు తీస్తున్న జయప్రదాదేవి కొడుకు ఆగమనాన్ని గమనించి అటు చూసింది.

ఆనందమూర్తి ముఖం ప్రఫుల్లమైంది. నెత్తిమీంచి నీళ్ళు కారుతున్నాయి. చెంపల మీదుగా జారి విశాల వక్షం మీద పడి, జారుడుబండ జారే పిల్లల్లా జర్రున క్రిందికి జారిపోగా, మిగిలినవి తామరాకుపై నిలిచిన నీటి బొట్లకు మల్లే తళుక్కుమంటున్నాయి.

జయప్రదాదేవి తీస్తున్న బట్ట లక్కడే వదిలి, "ఒరేయ్, బాబూ! అయ్యయ్యయ్యో! ఇదేమిట్రా? నెత్తిమీంచి నీళ్ళోడుతుండగా అట్లే వస్తున్నావు" అంటూ కొడుకును గబగబా సమీపించింది.

"ఏదీ వంగు" అంటూ కొడుకు తల వంచింది. పయటచెంగుతో తుడుస్తూ, "ఇరవై ఏండ్లొచ్చాయి, ఇంకా స్నానం చేసి తల తుడుచుకోవడం రాదాయె!" అంది.

"అమ్మా! నీతో పెద్ద చిక్కొచ్చింది. చిన్న అలా అన్నావు. ఈ వేళ ఇలా" అని తల్లి గుండెల మీద తల ఆనించి రెండు చేతులు చుట్టేశాడు.

జయప్రదాదేవికి తానేమందో స్ఫురించక, "ఏమన్నానురా?" అని అడిగింది.

"చిన్న స్నానం చేసి నెత్తి బాగా తుడుచుకొని వస్తుంటే, అమ్మో, అమ్మో! మా బాబు పెద్దవాడయ్యాడు. ఇక ఈ అమ్మ పమిటతో తుడిపించుకోడేమో అని అన్నావు." తల్లి అన్నట్లుగానే అనుకరించాడు ఆనందమూర్తి.

"ఎక్కిరిస్తున్నావు కదురా?" అంటూ చిన్న పిల్లల్ని కొట్టడానికి ప్రయత్నించినట్లు చెయ్యెత్తింది.

"కాదమ్మా కాదు. నీ వన్నట్లు అవగలుగుతానో, లేదో ప్రయత్నించి చూశా" అంటూ బుంగమూతి పెట్టాడు.

"నా నాయనే!" ఆనందమూర్తిని అక్కున చేర్చుకుంది. "ఔనురా, బాబూ! ఇంత కాలం దినం తప్పకుండా చేసే పనులు ఒక్క నాడు ఏ ఒక్కటైనా చేయకపోతే ఆ రోజు ఎంతో వెలితిగా ఉంటుంది. మనసు అదోలా అవుతుంది. ఓ రకమైన అసంతృప్తి చోటు చేసుకుంటుంది" అని రెండు చేతులతో కొబ్బరిమాని తీసుకొని ఆనందమూర్తి తల కంటపాగింది.

"అందుకే గదమ్మా, ఈ రోజు తలనీళ్ళు తుడ్చుకోకుండానే వచ్చేశా."

ఆ మాటతో ఆమెలో ఆనందం ఉప్పెనలా ఉప్పొంగి, "నా నాయనవు కదూ! నా ఆనందమూర్తివి కదూ!" అంటూ అతని తలను తన ఎద మీదికి తీసుకుంది.

"జయా! నీ గారాబంతో వాణ్ణి ఎటూ గాకుండా చేసేటట్లున్నావు." అప్పుడే గదిలోకి అడుగిడిన రమణమూర్తి.

"నా గారాబంతో ఎటూ గాకుండా అయ్యేవాడయితే, ఈ నాడు బి. ఎ. పాసయ్యుండే వాడు కాదు. ఇంకో నెల, రెండు నెల్లాగండి. ఏ ఆఫీసరో అవుతాడు. అప్పుడు తెలుస్తుంది, వాడి ప్రయోజకత్వం!" సగర్వంగా భర్త వైపు చూస్తూ అంది.

"సరేలే. అదీ చూస్తాను" అని, "అబ్బాయ్! ప్రొవిజినల్ సర్టిఫికేట్ కీవేళేగా రమ్మంది?" అని గుర్తు చేశాడు రమణమూర్తి.

"ఔను, నాన్నా!" వినమ్రత నిండుగా తొణికిసలాడింది.

• • •

బంకించంద్రుని 'ఆనందమఠం' నవలా పఠనంలో లీనమై ఉంది శ్యామల.

అవతల వర్షం వర్షాకాలాన్ని తలపింప చేస్తోంది. తలుపు తట్టిన శబ్దం గట్టిగా అయింది. ఆ శబ్దాన్ని బట్టి అప్పటికే కనీసం రెండు, మూడు తడవలైనా తలుపును తట్టి ఉంటారని శ్యామల ఇట్టే గ్రహించుకుంది. ఓ వైపు నవలా పఠనం, మరో వైపు వర్షావేగం ఆమెకా శబ్దాన్ని వినిపించకుండా చేశాయి.

శ్యామల గబుక్కున పుస్తకం పక్కన పెట్టి వాకిటి వైపు చరచరా వెళ్ళింది. తలుపులు తెరిచేసరికి ఆనందమూర్తి నిలువునా తడిసి ముద్దయివచ్చాడు.

"అరెరే! పూర్తిగా తడిసిపోయారే! వండి తోపటికి. ఇలా వచ్చారేమిటి?" అని అడుగుతూ తన పమిటను అందించి, "తుడుచుకోండి" అంది శ్యామల.

ఆ మాటతో ఆనందమూర్తి పయవాలు ఆ పమిట మీద చిత్రంగా నిలిచాయి. మదిలో ఏదో దివ్యానుభూతి పిల్లతెమ్మెరలా మెదిలింది.

"ఏమి టలా చూస్తున్నారు?" శ్యామల ప్రశ్నించింది.

సమాధానంగా ఆనందమూర్తి తల వంచాడు.

శ్యామల పమిటతో భర్త నెత్తిని తుడుస్తూ, "ఈ వర్షంలో తడుస్తూ ఎందుకొచ్చారు?" అని సౌమ్యంగా అడిగింది.

"ఈ వర్షంలో రాకుండా ఉంటే ఈ అనుభవం, ఈ అనుభూతి కలిగేవా నాకు?" ఎదురుప్రశ్న వేశాడు.

"ఆఁ. . .ఆఁ... అత్తయ్యే ఉంటే అంతా తెలిసొచ్చేది."

"అది తెలిసే ఇట్లా వచ్చా. తెలుసా?"

"ఇప్పుడేగా తెలిసింది!"

• • •

ఆనందమూర్తిలో ఉన్న చివరి కోరిక ప్రాయం ఒక్క పుష్కరిణి కాలం. అది తన అవసానదశలో నెరవేరాలని అతని ఆకాంక్ష. ఈ నా దది అక్కరాలా కాకపోయినా, గుడ్డికన్నా మెల్ల మేలన్నట్లు తీరనుంది. ఆనందమూర్తిలో నిర్లిప్తమైన జవసత్త్వాలు పునరుత్తేజితమై పెర్రికమింతాయి.

పయటచెంగు కాంతి ప్రతీక అయిన ధవళ పతాకంలా పవనుని పరిహాసానికి నవ్వుతున్నట్లు రెపరెపలాడుతూంది.

ఆనందమూర్తి ఆ వైపు నాతనోత్సాహంతో ముమ్మందుకు సాగిపోతున్న యువకునై నిలువునా పోతిపోతున్నాడు.

• • •

పన్నెండేళ్ళ నాడు—


జయప్రదాదేవి మరణశయ్యపై చిక్కి శల్యావస్థలో ఉంది. కొడుకు, కోడలు చెరో పక్కన ఉన్నారు. వారి వదనాల్లో విషాదచ్ఛాయలు ఆకాశంలో కారుమేఘాల్లా దట్టంగా అలుముకున్నాయి. వారి పక్కనే ఉన్న పిల్లలిద్దరు బొమ్మ వా పరిస్థితిలో చూడలేకుండా ఉన్నారు.

జయప్రదాదేవి కనురెప్పలు బరువుగా తెరుచుకున్నాయి. ఆమె నిదానంగా కొడుకును, కోడల్ని, మనుమల్ని తనివి తీరా ఓసారి చూసింది. ఆమె దృష్టి మరోమారు ఆనందమూర్తి విషాద వదనాన్ని వీక్షిస్తూ ఆగిపోయింది.

మూతలు పడుతున్న ఆమె కనుగవల్లో కన్నీళ్ళు చిప్పిలి కనుకొలకుల్లోంచి కారుతున్నాయి. గుంటలు తేలిన కంఠం మీదుగా జారి సంస్కార విహీనమైన తలతిత్తితో గుబురైన పొదలం దాపుకు పారిన రక్షరిలా అదృశ్యమయ్యాయి.

ధారాపాతంగా జాలువారుతున్న ఆమె కన్నీళ్ళు తుడుస్తూ, "అమ్మా!" అని పిలిచాడు ఆనందమూర్తి. ఆ కంఠం కోరాతయంతో జీరపోయింది.

"బాబూ! కన్నీరు కాదు, నాయనా, ఇది. ఆనంద బాష్పాలు. నా జీవితంలో సుఖం



తప్ప దుఃఖ మెరగని దాన్ని. మీ నాన్నగా రున్నవాడు, ఆ మున పోయాక ఈ ఏడేండ్లు కించిత్తయినా చీకు, చింత లేకుండా కాలం హాయిగా గడిపాను. భగవంతుడు ఏలనో నా కొకే ఒక లోటు వేశాడు. ఆ లోటు లోటుగానే మిగలకుండా వాడే నిన్ను ప్రసాదించి ఆ లోటుకూడా తీర్చాడు."

జయప్రదాదేవి నీరసం చేత చెప్పడ మాపింది కాస్సేపు.

ఆమెలో పేరుకుపోయిన నీరసాన్ని గమనించి, "అమ్మా! ఇక నిద్రపో, అమ్మా" అన్నాడు ఆనందమూర్తి.

"నిద్ర పోతాను, బాబూ! ఇక నా కొచ్చేది దీర్ఘనిద్రేగా! అందుకే నే చెప్పేది విను. ఎన్నాళ్ళుగానో చెప్పాలనుకుంటున్నా నొక విషయం."

ఆనందమూర్తి కదేమిటో ఊహ కందనిదిగా ఉంది. "సరే, చెప్పు" అన్నట్లు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆమెలో నూతనోత్సాహం ఉప్పొంగు కొచ్చి చెప్ప నారంభించింది.

"ఒకనాడు మీ నాన్న, నేను కృష్ణానది ఒడ్డున మాట్లాడుకుంటూ కూర్చుండిపోయాము. ఉద్ధృత నదీప్రవాహం పొరలి పొరలి పారుతూంది. ప్రొద్దు సద్దు చేయకుండా గ్రుంకింది. క్రమంగా నిశాదేవి తన నిజరూపాన్ని విశ్వరూపంలా ప్రదర్శించ సాగింది. ఆ ప్రాంత మెప్పుడో నిర్మానుష్య మయింది. అంతలోనే ఒక స్త్రీమూర్తి నదీతీరాన్ని సమీపించింది. అది గమనించి మీ నాన్న వాయువేగంతో పరుగు తీశాడు. ఆ స్త్రీ నదిలో దూకడాని కుద్యుక్తించడం, మీ నాన్న ఆమెను నిరోధించడం ఒకేసారి జరిగాయి. కొన్ని క్షణాలపాటు ఆమె పెనగులాడింది. ఆత్మహత్యకై చేసిం దంతా వ్యర్థప్రయత్న మయింది. ఎట్లాగో ఒప్పించి ఆమెను తీసుకొచ్చాడు. ఆ తరవాత ఇంటికి తీసుకెళ్ళాము.

"ఆ రాత్రి ఆమె ద్వారా తెలిసిన వివరాలు సంగ్రహంగా ఇవి: ఆమె పేరు త్రిపురసుందరి. బాలవితంతువు. ముప్పది యారు వసంతాల ప్రాయం. యౌవన మంతా శిశిరంలా గడుపుకున్న ప్రౌఢ. అనూహ్యమైన పరిస్థితిలో పరపురుషునికి వయుట పడిచింది...ఆ పాపానికి బీజాంకుర మైనట్లు ఆ మాసం గడిచేలోగానే తెలిసింది. తరతరాల వంశగౌరవానికి తీరని కలంకం ఆపాదించింది. అది ఎలాగైనా లోకానికి తెలుస్తుంది. తెలిసేపర కెందుకు ఉండాలి? లోకులు కాకుల్లాంటి వారు. మహాపులు కాకులు గావు, ఇనుపముక్కు కాకులు. ఆ కాకుల భీతికి ఆత్మహత్యకు పూనుకుంది.

"అమ్మా! శ్యామలా! కొన్ని మంచి నీళ్ళు తే, అమ్మా!" అంది కోడల్ని ఉద్దేశించి జయప్రదాదేవి.

శ్యామల వెంటనే లేచింది. మంచినీళ్ళు పట్టుకొచ్చి కూర్చుంటూ, "అత్తయ్యా! ఇప్పటి కిది చాలించి విశ్రాంతి తీసుకో" అని జయప్రదాదేవికి మంచి నీళ్ళు తాగించింది.

ఆనందమూర్తిలో త్రిపురసుందరిని గూర్చి ఇంకా తెలుసుకోవాలన్న జిజ్ఞాస పురి విప్పుకుంది. తనకు ఆమెను గూర్చి చెప్పడంలో తల్లి ఆంతర్యం ఊహ కందకున్నా, వినాలనే ఉబలాటం విధిగా హెచ్చింది. శ్యామల మూలంగా ఆ సేస్తుం దేమోనని లోలోన చింతించాడు.

"శ్యామలా ఈ బొందిలో ప్రాణం ఉండగానే చెప్పాలి కదమ్మా చెప్పవలసిం దంతా? అయినా, ఇంకెంతో లేదు. కాస్తే ఉంది." తలను దిండుమీదికి చేరుస్తున్న కోడలితో అంది.

"మే మొక పథకం వేశాము. దాని ప్రకారం సుందరిని కర్నూల్ నర్సింగ్ హోమ్‌లో చేర్పించాము. అక్కడ మీ నాన్నగారి బాల్యమిత్రుడు డాక్టరవడం చేత మా పథకం నిరాఘాటంగా జయప్రదం కాగలిగింది. నెలలు నిండగానే తంతి అందింది. వెంటనే బయల్దేరాము. సుందరి ప్రసూతి గదిలో ఉంది. గదిని సమీపిస్తుంటే ఆమె పడుతున్న వేదనాపూరితమైన మూలుగులు విస్పష్టంగా వినిపించసాగాయి. సుందరిని సమీపించి చేయూత ఇచ్చాను. మరు క్షణంలోనే సుఖప్రసవ మయింది. మగ శిశువును కన్నది. ఆమె పట్ల మేము చూపిన శ్రద్ధాసక్తులకు, తగు ఏర్పాట్లకు ప్రతిగా ఆ శిశువును నా పయట చెంగులో వేసింది. లోలోన ఎంత బాధ పడ్డా, పైకి కనబరచలేదు. ఆరు మాసాల వరకు ఆమె అక్కడే ఉండే ఏర్పాట్లు చేశాము. ఆ శిశువువే నీవు! నా జీవితంలో ఎనలేని ఆనందాన్ని ప్రసాదించిన నా ఆనందమూర్తివి" అని అతని జన్మ రహస్యాన్ని వివరించింది.

"లోకం నిన్ను మా పెంచుకున్న బిడ్డగా కాక, కన్నబిడ్డగా చూడాలని అభిల

జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా
మీ ఆనందాన్ని
పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో
తీసుకోండి
మైక్రోఫైన్ ఆస్ప్రో నొప్పిని
అతిశీఘ్రంగా తొలగించును

ASPRO
Nicholas

A.G.62.71

సించాము. మద్రాసు రాష్ట్రాన్ని వదిలేసి హైదరాబాదుకు వలస వచ్చాము. దీనితో, త్రిపురసుందరి సహితం మాతో కలిసే అవకాశాలు లేకుండా అయ్యాయి. ఈ నాడు నీ కన్నతల్లిని చూపించలేను. ఎక్కడుందో, లేదోకూడా తెలుపలేను. కాని, నీ కన్నతండ్రి ఎవరో తెలుపగలను. ఇనప్పెట్టెలో మీ నాన్న వ్రాసిన ఉత్తరం కవరులో ఉంది. అది చూస్తే నేను కలిగించిన దుఃఖానికి ఉపశమనం కలుగుతుంది'' అని చెప్పి ఇక చెప్పవలసింది లేదన్నట్లు కండ్లు మూసుకుంది.

• • •

''జయా!

జీవితంలో కొన్ని విషయాలు జీవిత కాలంలో తెలుపలేనివి ఉంటాయి. మరికొన్ని ముఖాముఖి నుడువలేనివి ఉంటాయి. అలాంటప్పుడు లేఖలు ప్రధాన పాత్ర వహిస్తాయి. మన దాంపత్య జీవితంలో ఎలాంటి దాపరికాలూ లేవు, ఒకటి తప్ప. దాని మూలంగా మన సహజీవన ధర్మానికి కళంకం కలిగించరాదని ఈ ఉత్తరాన్ని వ్రాసి పెడుతున్నాను.

వీరాలలో నాకో మిత్రుడున్న విషయం నీకు తెలుసు. ఆ వైపు వెళ్ళినప్పుడల్లా వాని ఇంటికి వెళ్ళే విషయం నీకు తెలియనిది కాదు. ఒకనాటి రాత్రి ఎనిమిదిన్నరకు వెళ్ళాను. ఆ ఇంట్లో వడీ చప్పుడూ లేదు. అక్కడ నాకు గల చొరవ వల్ల లోపలికి దారి తీశాను. 'గోపీ!' అని పిలుస్తూ పక్క గదిలోని కెళ్ళాను. చెప్పగూడని దృశ్య మెదురయింది. నాలో క్షణికోద్రేకం ఉద్భవిమ్చి వివేకహీనుణ్ణయ్యాను. పశుత్వం ప్రకోపించింది. తన శరీర సౌందర్యాన్ని తనివితీరా తిలకిస్తూ తన్మయత్వంలో ఉన్న మిత్రుని అనుజ మొదట భీతావహమైనా, నన్ను చూశాక ప్రతిఘటించ లేకపోయింది.

ఆ తరవాత నెల రోజులకు కృష్ణానదీ తీరాన కనిపించింది. దైవికంగా మనమక్కడే ఉండడం తటస్థించింది. ఆమె ఆత్మహత్యా ప్రయత్నాన్ని నిరోధించబోయాకగాని, ఆమె ఎవరో తెలిసింది కాదు. మిగతా విషయమంతా నీకు సువిదితమే. ఒక్కటి మాత్రం ఇంకా చెప్పవలసి ఉంది.

సుందరి నన్ను కలవాలన్న నిశ్చయంతో ఇల్లు వదిలి వచ్చింది. మన ఊరు చేరుకున్నాక మన దాంపత్య జీవితంలో చిచ్చు రగల్చడం భావ్యం కాదనుకుంది. ఆత్మహత్యకు పూనుకుంది. నర్సింగ్ హోమ్‌లో ఆమె ద్వారా తెలుసుకున్న విషయ మిది.

> మంచి చేయడానికి మనకు లభించే అవకాశాలే మన శక్తి సామర్థ్యాలకు గీటురాళ్ళు.
>
> —పి. పేటర్

సుందరి కన్యాయం చేసినా, పుట్టిన బిడ్డడికి తండ్రిగా నా బాధ్యత తీర్చుకుంటున్నాననే ఆత్మసంతృప్తి చేకూరినందుకు నిండుగా ఉండగలిగాను.

జయా! నీకీ విషయం ముందుగా తెలుపకపోవడానికి కారణం లేకపోలేదు. ఏ స్త్రీ అయినా ఎట్టి పరిస్థితుల్లోకూడా తన భర్త వల్ల సాటి స్త్రీ యందు కలిగిన సంతును పెంచుకోవడానికి స్వీకరించ (లే)దు. నూరు ఆరయినా, ఆరు నూరయినా అంగీకరించదు. అవునా?

జయా! నా జీవితాన్ని ప్రశాంతంగా చాలించాలని నీకీ ఉత్తరం వ్రాశాను. నన్ను క్షమిస్తావు కదూ?

ఆ ఆశతోనే ముగిస్తున్నాను.

ఇట్లు
—నీ రమణీయ మూర్తి.''

జయప్రదాదేవి మరణానంతరం ఇనప్పెట్టె తాళం చేతులు చేతి కందిన ఆనందమూర్తి ఆ ఉత్తరాన్ని చూడకుండా ఉండలేక పోయాడు.

• • •

ఆనందమూర్తి ప్రాకుతూ ప్రాకుతూ బండరాయికి చేరువ అయ్యాడు. పయట చెంగు అదృశ్యమయింది. ఆయాసం అమావాస్య పెనుచీకటిలా అయింది. గుండెను ఎవరో పిండుతున్నట్లయింది.

''అమ్మా!'' అంటూ నేలను బల్లిలా కరుచుకున్నాడు.

''ఎవరదీ?'' అంటూ ఆ శబ్దం వచ్చిన దిశ చూసింది ఆ పమిట తాలూకు మనిషి. ఆమె ఒక వృద్ధ స్త్రీ. ఆమెను మరో ఇద్దరు స్త్రీలు అనుసరించారు. వారి పయటచెంగులు బారెడు, మూరెడు, జానెడు నిడుపులతో వారి ప్రాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఆనందమూర్తిని చూడగానే ప్రమాన్పడిపోయింది. ఎప్పుడో చూసిన వ్యక్తి పోలికలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. 'ఆయన ఈ ప్రాయంలో ఉండడు. ఇంకా బతికి ఉన్నారో—లేదో! ఆ పోలిక లున్న ఇతను ఎవరు?' తనలో తాను ప్రశ్నించుకుంది.

''ఎవరు, నాయనా, నువ్వు?'' ఆనందమూర్తిని సమీపించి ప్రశ్నించింది.

''అమ్మా!'' అని బాధగా, భరించలేని బాధతో మూలిగాడు.

ఆ అవస్థను చూడలేక, ''ఏమిటి, బాబూ, నీ అవస్థ?'' అంటూ అతని పక్కన చేరి తలను ఒళ్ళో చేర్చుకుంది.

''అమ్మా!'' అని నోరారా పిలిచాడు. ఎన్నాళ్ళకో చూసి నోటి నిండా పిలిచినట్లు ధ్వనించింది.

మూరెడు పమిట గల మనిషి ఆనందమూర్తిని పరీక్షగా వీక్షించసాగింది.

''అమ్మా! అడగక ముందే నా తుది కోరిక తీర్చావు. నా అవస్థ నీకు గాక మరెవరికి చెపుతానమ్మా?'' అంటూ తన ఎదను సూచనప్రాయంగా రెండు చేతులతో అదుముకోసాగాడు.

ఆమె తిన్నగా అతని చేతులు తొలగించి రొమ్మును రాయసాగింది.

''అమ్మా! నా జీవితం పూలతోట. నాకే లోటూ లేదు. కాని, అమ్మ చనిపోయేముందు తన ఆత్మశాంతికై ఒక కఠోర సత్యాన్ని తెలిపింది—తాను కన్నతల్లిని కానని. అమ్మ చెప్పేవరకు నాకా విషయమే తెలియదు. ఇక నన్ను కన్నతల్లి ఎలా ఉందో, ఎక్కడుందో, అసలు ఉందో, లేదోకూడా తెలియని నిర్భాగ్యుణ్ణి'' అని బాధగా వివరించాడు.

''అయితే, రమణమూర్తిగా రబ్బాయివా?''

''మీరు ఆనందమూర్తియే కదండీ!'' సందేహ నివృత్తికై అడిగింది మూరెడు పమిట మనిషి.

''అవును'' అంటూ చూపులు అటు తిప్పాడు. యూనివర్సిటీ ప్రాంతంలో తన ముఖం మీదికి వాలిన పమిట తాలూకు మనిషిలా ఉంది.

''బాబూ! రమణమూర్తిగా రబ్బాయివేనా?'' మరింత ఆత్రతతో ప్రశ్నించిం దా వృద్ధస్త్రీ.

''అవునమ్మా'' అని నెమ్మదిగా చెప్పాడు.

ఆ మాట వినడంతోనే, ''బాబూ! నా నాయనా! ! నా కన్నా! ! ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నిన్ను చూసే భాగ్యం కలిగిందిరా?'' అంటూ [illegible] ఉన్మాదినిలా ఆనందమూర్తి [illegible] మనసార ముద్దుల జల్లు కురిపించింది. అంతటితో ఆగక ఆనందమూర్తిని నిండుగా తన గుండెల కదుముకొని, ''నేనే, నాయనా, నేనే నీ కన్న తల్లిని. పాపిష్టిదాన్ని'' అంది. ఇరువురి నయనాల ఆనందబాష్పాలు బొట బొట జారుతున్నాయి.

''అన్నయ్యా!'' అని ఒకరు, ''మామయ్యా!'' అని మరొకరు ఆర్ద్ర కంఠంతో ఆనందమూర్తిని చుట్టేశారు.

ఆనందమూర్తి చూపులు నిశ్చలత వహించాయి. కన్నీటిధారలు కనిపిస్తున్నాయి.

''బాబూ! నిన్ను పురిట్లోనే మీ అమ్మ జయమ్మ ఒళ్ళో వేశాను. దిక్కుతోచని పరిస్థితుల్లో అదే ఉచిత మనుకున్నాను. మీ నాన్నగారు ఆరు మాసాల వరకు నర్సింగ్ హోమ్‌లో ఉండే ఏర్పాట్లు చేశారు. ఆ లోగానే భగవదనుగ్రహం వల్ల డాక్టరుబాబు తన జీవితం లోని కాహ్వానించారు. వారు అభ్యుదయ వాదులు. పైగా విశాల హృదయులు. వెంటనే వారికి నా అభిప్రాయం తెలుపలేక పోయాను. వారు తొందర పెట్టలేదు. దీర్ఘంగా ఆలోచించుకొని తగు నిర్ణయం తీసుకోండని అర్థించారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య పోయి చేతులు కాల్చుకుంటున్న డాక్టరు గూర్చి కాకుండా, నా భవిష్యజ్జీవితాన్ని గూర్చి ఎక్కువగా ఆలోచించాను. అన్నయ్య వద్దకు వెళ్ళే అర్హత ఏనాడో కోల్పోయిన నాకు కుక్కలు చింపే విస్తరాకు కండ్లముందు మెదిలింది. నా బ్రతుకు కలా చేసుకోకూడ దనుకున్నాను. ఆ సువర్ణావకాశాన్ని జారవిడుచుకోకూడ దనుకున్నాను. అంతే. మేము కోర్టు వివాహం గావించుకున్నాము. మా సంతానమే ఈ గీత'' అంటూ తన కూతుర్ని చూపిస్తూ ఆనందమూర్తి వదనంలోకి వీక్షించింది త్రిపురసుందరి.

ఆనందమూర్తి చూపులు అలాగే నిలుచున్నాయి. చలనం కనిపించడం లేదు. ప్రశాంతంగా ఉన్నాయి. తేజోవిహీనంగా అయ్యాయి. కాయం మంచు ముద్దలా తోచింది.

''బాబూ !'' అని ఒక్కసారి గొంతు చించుక అరిచి గొల్లు గొల్లుమని పైన బడి రోదించసాగింది త్రిపురసుందరి.

సూర్యాస్తమయ మెప్పు డయిందో ఎవరూ గమనించలేకపోయారు.

సమీరుని తీవ్ర సంచలనానికి త్రిపురసుందరి నిడువైన పయట చెంగు లేచి ఆనందమూర్తిని కప్పేసింది. ★